పోస్టాఫీస్ భవన నిర్మాణం ఎప్పుడో?

- ఏళ్లుగా అద్దె భవనంలోనే విధులు
- పట్టించుకోని ఉన్నతాధికారులు



అద్దె భవనంలో నిర్వహిస్తున్న పోస్టాఫీస్



ధర్మాజీగూడెంలో నిరుపయోగంగా ఉన్న పోస్టాఫీసు స్థలం

లింగపాలెం: మండలంలోని ఏకైక మేజర్ గ్రామ పంచాయతీ ధర్మాజీగూడెంలోని సబ్ పోస్టాఫీసుకు లక్షలాది రూపాయల విలువ గల స్థలం ఉన్నా భవన నిర్మాణానికి నోచుకోలేదు. ఈ విధంగానే ఏళ్లు గడుస్తున్నా పట్టించుకోని పాలకులు, అధికారుల తీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ధర్మాజీగూడెంలో ఈ సబ్ పోస్టాఫీసు నుంచి ప్రతి నిత్యం మండలంలోని 20 గ్రామ పంచాయతీలకు ఉత్తర ప్రత్యుత్తరాలు బట్వాడ చేస్తారు. దీని పరిధిలో 8 బ్రాంచి ఆఫీసులు ఉన్నాయి. ధర్మాజీగూడెం పోస్టాఫీసు నుంచి లక్షల రూపాయల్లో ప్రజలు పొదుపు చేసుకోవటంతో పాటు వ్యాపార లావాదేవీలు కూడా జరుగుతాయి.

అద్దె భవనంతో అవస్థలు

పోస్టాఫీసుకు ఎంతగానో అనుకూలమైన స్థలం ఉన్నప్పటికీ చాలీచాలని అద్దె భవనంలో కొనసాగించటంతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటి వరకు పోస్టాఫీసుకు పొదుపు, ఉత్తరాల కొనుగోలుకు ఇక్కడకు వెళ్లటంతో ఈ అద్దె భవనాల్లో ప్రజలకు సౌకర్యాలు లేకుండా ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ పోస్టాఫీసు నుంచి ఎస్బీ, ఆర్డీ, ఎన్ఎస్సీ, కేవీపీ, ఎస్ఎస్వై వంటి సేవలను ప్రజలకు అందజేస్తున్నారు. వీరంతా గంటల తరబడి వరండాలో, ఎండలో పడిగాపులు కాయాల్సి వస్తుందని లబ్ధిదారులు ఆరోపిస్తున్నారు. ఈ గ్రామంలో పోస్టాఫీసు భవన నిర్మాణానికి ఏలూరు–చింతలపూడి ప్రధాన రహదారి పక్కనే సుమారు 25 సెంట్ల వరకు స్థలం ఉంది. నేడు ఈ స్థలం నిరుపయోగంగా మారింది. ఈ స్థలం రానురాను ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని పలువురు ఆరోపిస్తున్నారు. ఈ స్థలంలో పోస్టాఫీసుకు భవనం నిర్మించాలంటూ అనేక పర్యాయాలు ఎంపీలు, కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకుండా పోయిందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి ప్రజలకు అందుబాటులో ఖాళీగా ఉన్నా ఎంతో విలువైన స్థలంలో పోస్టాఫీసు భవన నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

శాశ్వత భవనం నిర్మించాలి



ధర్మాజీగూడెంలో శాశ్వత పోస్టాఫీస్ భవన నిర్మాణం చేపట్టాలని అనేక పర్యాయాలు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు విన్నవించినా ఫలితం లేకుండా పోయింది. పోస్టాఫీసుకు ఖరీదైన స్థలం ఉన్నప్పటికీ భవనం నిర్మాణానికి ఏళ్ల తరబడి నిధులు మంజూరు చేయకపోవటం బాధాకరం. భవనం లేకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రజా ప్రతినిధులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

–కందుల చిట్టియ్య, వ్యాపారి, ధర్మాజీగూడెం

అద్దె భవనంతో అసౌకర్యం



స్థానిక పోస్టాఫీసుకు వేలాది రూపాయలు అద్దె చెల్లించి ఇరుకు గదుల్లో విధులు నిర్వహించటం ప్రజలకు అసౌకర్యంగా ఉంది. ఇక్కడ ఇరుకుగా ఉండటంతో పోస్టాఫీసుకు వచ్చే ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. కనీసం వీరికి నీడ సదుపాయం కోసం ఒక రేకుల షెడ్ కూడా లేకపోవటం మరో వైపు వచ్చిన వారికి కనీస సదుపాయాలు కూడా లేకపోవటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి పోస్టాఫీసుకు వచ్చే ప్రజలకు సదుపాయాలు కల్పించాలి.

–నూతులపాటి శ్రీను, ధర్మాజీగూడెం

క్లుప్తంగా

నూకాలమ్మకు కలశాలతో పూజలు



నూకాలమ్మ ఆలయంలో కలశాలతో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో కొలువైన నూకాలమ్మ షష్టమ వార్షికోత్సవాలు సోమవారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త శ్రీబాలా త్రిపుర సుందరీ పీఠం ప్రతినిధి బ్రహ్మశ్రీ ఈమని శశికుమార్ శాస్త్రి మాట్లాడుతూ ఆధ్యాత్మిక కార్యక్రమాల వలన ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందని పేర్కొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి ఆలయ ప్రతిష్ఠ 2019 మే 19న చేశామని, నేటికి ఆరు సంవత్సరాలు పూర్తయిందని, పట్టణాభివృద్ధి ఆకాంక్షిస్తూ అమ్మవారికి విశేష కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్న ప్రసాద వితరణ చేశారు.

శ్రీవారి స్వర్ణమయ పథకానికి విరాళం



దాత సుశీలకు విరాళం బాండ్‌ను అందిస్తున్న ఆలయ ఏఈఓ నటరాజారావు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయ విమాన గోపుర స్వర్ణమయ పతకానికి ఓ భక్తురాలు సోమవారం లక్ష రూపాయలను విరాళంగా అందజేశారు. తాడేపల్లిగూడెంలోని వానపల్లికి చెందిన ఇలపోలు సుశీల ముందుగా కుటుంబ సభ్యులతో కలిసి స్వామి, అమ్మవార్లను దర్శించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమ చేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఏఈఓ పి.నటరాజారావు విరాళం బాండ్‌ను అందజేశారు

జీసీసీ సీనియర్ మేనేజర్‌గా రాజయోగి

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్‌పురం గిరిజన సహకార సంస్థ (జీసీసీ) సీనియర్ మేనేజర్‌గా చెరుకూరి రాజయోగి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇదే కార్యాలయంలో అకౌంటెంట్‌గా పని చేస్తున్న రాజయోగి ఇటీవల సీనియర్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొందడంతో జీసీసీ సీనియర్ మేనేజర్‌గా బాధ్యతలను అప్పగించారు. ఇప్పటి వరకూ రంపచోడవరం ఈఎంగా పని చేస్తున్న పార్వతీశ్వరరావు కేఆర్‌పురం జీసీసీ ఇన్‌చార్జి సీనియర్ మేనేజర్‌గా బాధ్యతలు నిర్వహించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన రాజయోగి మాట్లాడుతూ గిరిజన ఉత్పత్తులను ప్రతి ఒక్కరికీ చేరువయ్యేలా కృషి చేస్తామని చెప్పారు.

కొనసాగుతున్న రిలే నిరాహార దీక్ష



నినాదాలు చేస్తున్న ఆదివాసీ సంక్షేమ సభ్యులు

వేలేరుపాడు: మండలంలోని ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో జీవో నంబర్ 3 గురించి రిలే నిరాహార దీక్షలు కొనసాగుతున్నాయి. ఈ దీక్ష చేస్తున్న వారికి మద్దతుగా మండల కమిటీ నాయకులు సంఘీభావం తెలిపి మాట్లాడారు. మండలంలోని ఏఏస్పీ అధ్యక్షుడు సోడా సీతారామయ్య మాట్లాడుతూ జీవో నంబర్ 3కు చట్టబద్ధత కల్పించాలని, ఏజెన్సీ డీఎస్సీని తక్షణమే ప్రకటించాలని, ఆర్అండ్ఆర్ ప్యాకేజీ క్లియరైన వారిని పునరావాసాలకు తరలించాలని కోరారు. కార్యక్రమంలో ఉయిక ముత్యాలరావు, సీహెచ్ రామకృష్ణ, కణితి లక్ష్మణ్, పైదా శేఖర్, పూనేం శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



రక్తదానం చేస్తున్న డీవైఎఫ్ఐ నేతలు

జంగారెడ్డిగూడెం: డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో సోమవారం రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక సూర్య బ్లడ్ బ్యాంక్ వద్ద కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్య కిరణ్ మాట్లాడుతూ దేశంలో అనారోగ్య సమస్యలతో నిరంతరం రక్తం కోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మాజీ నాయకులు ఎం.జీవరత్నం, పి.సూర్యారావు, పి.దుర్గారావు, పిల్లి పోతురాజు, ముంగమూరి అశోక్, బాలరాజు, కె.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా యాత్ర



తిరంగా యాత్రలో పాల్గొన్న అధికారులు

కొయ్యలగూడెం: ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో గర్విస్తూ చేపట్టిన తిరంగా యాత్రను సోమవారం కొయ్యలగూడెంలో నిర్వహించారు. పదిహేను వందల మీటర్ల జాతీయ పతాకాన్ని జాతీయ ప్రధాన రహదారిపై ప్రదర్శిస్తున్నారు పలు పార్టీల నాయకులు, ప్రజలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, అధికారులు భారీ ర్యాలీ నిర్వహించారు. జంగారెడ్డిగూడెం, కొవ్వూరు, పోలవరం రోడ్డులలో యాత్ర చేపట్టి అమర్ జవాన్లకు జోహార్లు అర్పించి, విజయంలో పాల్గొన్న సైనికులకు జిందాబాద్‌లతో నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ఎంపీడీవో కె.కిరణ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

సుందరయ్య జీవితం యువతకు ఆదర్శం



జంగారెడ్డిగూడెం: సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు



కొయ్యలగూడెం: పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి నిర్వహిస్తున్న నేతలు

ద్వారకాతిరుమల: పుచ్చలపల్లి సుందరయ్య జీవితం నేటి యువతకు ఆదర్శమని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు అన్నారు. మండలంలోని పంగిడిగూడెంలో సోమవారం రాత్రి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాలను నిర్వహించారు. ముందుగా సుందరయ్య చిత్రపటానికి సీపీఎం సీనియర్ నాయకులు గోగుల మండ ప్రసాదరావు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో మానుకొండ వీర్రాజు, భూక్య బిచ్చ నాయక్, రాంపండు, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లికి ఘన నివాళి

టి.నరసాపురం: మండలంలోని ఏఎస్ఆర్ నగర్ కాలనీలో పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏలూరు జిల్లా కమిటీ సభ్యులు గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ ఆదర్శమూర్తి శత్రువులతో కొనియాడబడిన నాయకుడు కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు మురళి, మడకం కుమారి, శిరీష, బరగడ కుమారి, తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛమైన రాజకీయ సంస్కృతికి నిలువుటద్దం

కొయ్యలగూడెం: స్వచ్ఛమైన రాజకీయ సంస్కృతికి నిలువుటద్దం పుచ్చలపల్లి సుందరయ్య అని సీపీఎం మండల కన్వీనర్ ఎస్.రాంబాబు పేర్కొన్నారు. సోమవారం సుందరయ్య వర్ధంతి కార్యక్రమం స్థానిక సీపీఎం, సీఐటీయూ ప్రజా సంఘాల కార్యాలయంలో నిర్వహించారు. కె.సీతారాములు, ఎస్.శివకుమార్, పి.రమేష్, ఎం.సురేష్, పి.తమ్మారావు, ఎ.సతీష్, ఎ.నాగరాజు, ఎం.త్రిమూర్తులు, సీహెచ్ మరిడియ్య, యు.గోపి, ఎం.సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

పీడిత ప్రజల ఆశాజ్యోతి

జంగారెడ్డిగూడెం: పీడిత ప్రజల ఆశాజ్యోతి పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం నిర్వహించారు. సుందరయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం, టౌన్ కన్వీనర్ పి.సూర్యారావు మాట్లాడుతూ సుందరయ్య ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో మండల కమిటీ సభ్యులు యాగంటి సీత, నిట్ట నాగరాజు, టౌన్ కమిటీ సభ్యులు ఎస్‌కే మాబు సుభాని, బి.బాలరాజు, వి.గోపి, పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు



జంగారెడ్డిగూడెం: పట్టుకున్న సామగ్రితో ఎక్సైజ్ అధికారులు



చింతలపూడి: పాత నిందితులతో ఎక్సైజ్ అధికారులు

జంగారెడ్డిగూడెం: సర్కిల్ పరిధిలో ఎక్సైజ్ పోలీసులు దాడులు నిర్వహించారు. మండలంలోని పుట్లగట్లగూడెంలో 800 లీటర్లు పులిసిన బెల్లపు ఊటను ధ్వంసం చేసి, 20 లీటర్ల నాటు సారాను, ఒక మోటార్ సైకిల్‌ని స్వాధీనం చేసుకొని గుర్రం చిట్టియ్యపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కె.శ్రీనుబాబు తెలిపారు. ఈ దాడుల్లో ఏలూరు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పీఎస్‌డీ భోగేశ్వరశ్యాం, ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

పాత నేరస్తులకు రిమాండ్

చింతలపూడి: స్థానిక ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పరారీలో ఉన్న వేములపల్లి, వెస్ట్ యడవల్లి గ్రామాలకు చెందిన దంపనబోయిన నరసింహం, పలగాని సురేషలను సోమవారం అరెస్ట్ చేసి జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్లు సీఐ పి.అశోక్ తెలిపారు. అదే విధంగా పంతంగలగూడెం గ్రామాలకు చెందిన నాటు సారా కేసుల్లో పాత నేరస్తులైన ఇస్లావతు నాగరాజు, దారవతు శిరీషలను చింతలపూడి తహసీల్దార్ ఎదుట, అంకాలంపాడు గ్రామానికి చెందిన చలమల భద్రయ్యను కామవరపుకోట తహసీల్దార్ ఎదుట ఇద్దరి బైండోవర్ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో చింతలపూడి ఎక్సైజ్ ఎస్సైలు ఆర్‌వీఎల్ నరసింహరావు, అబ్దుల్ ఖలీల్, జె.జగ్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

21 నుంచి మద్దిలో కల్యాణోత్సవాలు



శ్రీమద్ది ఆంజనేయస్వామి ఆలయం

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి హనుమద్ జయంతి సహిత కల్యాణ మహోత్సవాలు ఈ నెల 21వ తేదీ 25వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఆర్‌వీ చందన తెలిపారు. సోమవారం కార్యక్రమాల వివరాలను ఆమె వెల్లడించారు. 21వ తేదీ ఉదయం ప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయన్నారు. నిత్యకైంకర్యాలతో పాటు నిజరూప దర్శనం, విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, దీక్షాధారణ, అంకురారోపణం, వాస్తుపూజ, యాగశాల ప్రవేశం, ధ్వజారోహణ తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. 22వ తేదీ గురువారం నిత్య కైంకర్యాలతో పాటు హనుమద్ జయంతి సందర్భంగా స్వామి వారి లక్ష తమలపాకులతో పూజ, నిత్యహోమం, బలిహరణలు, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం నీరాజన మంత్రపుష్పాలు తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. 23వ తేదీ సువర్చలా హనుమద్ కల్యాణం, సాయంత్రం 6 గంటలకు స్వామి వారి గ్రామోత్సవం జరుగుతుందన్నారు. 24వ తేదీ నిత్యపూజలతో పాటు ఉపాలయమైన శ్రీ వెంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణం నిర్వహిస్తామన్నారు. 25వ తేదీ నిత్యపూజలతో పాటు మహా పూర్ణాహుతి, దీక్ష విరమణ, స్వామి వారికి అభిషేకం, ధ్వజావరోహణ, చక్రస్నానం, సాయంత్రం 7 గంటలకు తెప్పోత్సవం నిర్వహిస్తామన్నారు.

22న బైక్ ర్యాలీ



శోభాయాత్ర (బైక్ ర్యాలీ) కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

జంగారెడ్డిగూడెం: హనుమద్ జయంతి సందర్భంగా ఈ నెల 22న బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సోమవారం ఈ మేరకు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 22వ తేదీ గురువారం మధ్యాహ్నం 3 గంటలకు గుర్వాయిగూడెం మద్ది ఆంజనేయ స్వామి వారి క్షేత్రంలో కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. గుర్వాయిగూడెం నుంచి జంగారెడ్డిగూడెంలోని హైస్కూల్, ప్రభుత్వ డిగ్రీ కాలేజ్, బోసుబొమ్మ సెంటర్ మీదుగా కొవ్వూరు రోడ్డులో కొత్తపేట శ్రీఅభయాంజనేయ స్వామి ఆలయం వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో రామకృష్ణ మాస్టారు, మృత్యుంజయ శర్మ, కె.విశ్వనాథ్, కొనకళ్ల వెంకటేశ్వరరావు, మాడా రామ్మోహన్‌రావు, సాయి బ్రహ్మం, రవి, తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ల దగ్ధం



దగ్ధమైన పొగాకు బ్యారన్ గోడౌన్

కొయ్యలగూడెం: గవరవరం (వెంకయ్యపాలెం) సమీపంలో 18వ తేదీ రాత్రి సంభవించిన అగ్ని ప్రమాదంలో వర్జీనియా పొగాకు బ్యారన్ గోడౌన్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన రైతు అన్నంరెడ్డి బాబూరావు దాదాపు వంద బేళ్లను అమ్మకం నిమిత్తం తన గోడౌన్‌లో నిల్వ ఉంచారు. అగ్ని ప్రమాదం వలన బేళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయని రైతు వాపోయాడు. అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదన్నాడు. సోమవారం ఉదయం పొలం వెళ్లి చూసేసరికి గోడౌన్ దగ్ధమైందని తెలిపారు. ఈ ప్రమాదంలో సుమారు రూ.20 లక్షల మేర నష్టానికి గురైనట్లు బాబూరావు ఆవేదన చెందాడు.

చింతలపూడిలో..

చింతలపూడి: మండలంలోని ఊట సముద్రంలో గ్రామ సర్పంచ్ కాకాని రాంబాబుకు చెందిన పొగాకు బ్యారన్ సోమవారం ప్రమాదవశాత్తు దగ్ధమైంది. బాధితులు ఇచ్చిన సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు. బ్యారన్ లోపల ఉన్న జామాయిల్ కర్రకు నిప్పు అంటుకొని బ్యారన్ తగలబడినట్లు భావిస్తున్నారు. సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం సంభవించినట్లు రాంబాబు తెలిపారు.

ఘనంగా రాజగోపుర శిఖర ప్రతిష్ఠ



కలశాలను తీసుకొస్తున్న భక్తులు

కొయ్యలగూడెం: అంకాలగూడెం శ్రీఉమా సమేత భోగలింగేశ్వరస్వామి రాజగోపుర (గాలిగోపుర) త్రయాహ్నిక శిఖర ప్రతిష్ఠాపన ఉత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం తొమ్మిది గంటలకు యంత్ర కలశాలను గోపురంపై శాస్త్రోక్తంగా బ్రహ్మశ్రీ మామిళ్లపల్లి ఆనంద శివాచార్యుల పర్యవేక్షణలో ప్రతిష్ఠించారు. విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచన పూజలు నిర్వహించారు.

22న వాహనాల వేలం

జంగారెడ్డిగూడెం: పలు నేరాల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 22న బహిరంగ వేలం వేస్తున్నట్లు చింతలపూడి ఎక్సైజ్ ఇనెస్పెక్టర్ పి.అశోక్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22వ తేదీ ఉదయం 10 గంటలకు చింతలపూడి ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో వాహనాల వేలం ఉంటుందన్నారు. గూడ్స్ ఆటో, ఫోర్డ్ కారు, మోటార్ సైకిళ్లు, మోపెడ్ వాహనాలు వేలం వేస్తున్నామని తెలిపారు.

నూతన కమిటీ సభ్యుల ఎన్నిక

కొయ్యలగూడెం: ఏలూరు జిల్లా మేదర సంఘ నూతన కమిటీ నియామకం సోమవారం గవరవరంలో నిర్వహించారు. శ్రీలక్ష్మీ శ్రీనివాస మహేంద్ర మేదర సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా (నిడమర్రు) జోరిగే నాగేశ్వరావు ప్రధాన కార్యదర్శిగా (జంగారెడ్డిగూడెం) అంకోలు క్రాంతి కుమార్, కోశాధికారిగా (ఏలూరు) ధూళిపాల వెంకట రాంప్రసాద్, ప్రచార కార్యదర్శిగా (గవరవరం) పాతకోట నాగ వీరబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు ప్రారంభం

జంగారెడ్డిగూడెం: మండలంలోని మైసన్నగూడెంలో నిర్మించిన 30 అడుగుల అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా గ్రామంలోని రామాలయం నుంచి 108 మంది మహిళలు కలశాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమం 19వ తేదీ ప్రారంభమై 22వ తేదీ సాయంత్రం ఊరేగింపు మహోత్సవంతో పరిసమాప్తమవుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కుర్రు సుబ్బారావు, వామిశెట్టి నాగేశ్వరరావు, వామిశెట్టి మల్లేశ్వరరావు, కురు రవి బాబు, పిల్లి రామకృష్ణ, వల్లూరి శ్రీకాంత్, బుర్ర నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఆసుపత్రి పనులు పునఃప్రారంభించాలి

టి.నరసాపురం: బొర్రంపాలెం పీహెచ్‌సీ పనులు పునఃప్రారంభించాలని గ్రామస్తులు కోరుతున్నారు. బొర్రంపాలెంలో పీహెచ్‌సీ భవనం శిథిలావస్థలోకి చేరడంతో అప్పటి ఎంపీ కావూరి సాంబశివరావుకు వినతిపత్రం ఇచ్చామని, దీంతో ఆసుపత్రి నిర్మాణానికి రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని సామాజిక కార్యకర్త గుండె పాండురంగ తెలిపారు. స్థల సేకరణ, ఇతర కారణాలతో ఆసుపత్రి నిర్మాణం జాప్యమైంది. చివరకు స్థల సేకరణ చేసి, ఆసుపత్రి నిర్మాణం చేపట్టి అర్ధాంతరంగా పనులు ఆపేశారు. అప్పటి నుంచి నేటి వరకు ఆసుపత్రి నిర్మాణం జరగలేదన్నారు. కావున ఇప్పటికైనా ఆసుపత్రి భవన నిర్మాణాన్ని ప్రారంభించి పూర్తి చేయాలని కలెక్టర్‌ని కోరినట్లు పాండురంగ తెలిపారు.

శ్రీవారి సేవలో క్యారెక్టర్ ఆర్టిస్ట్



సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ జీవన్ కుమార్

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని సినీ క్యారెక్టర్ ఆర్టిస్ట్ జీవన్‌కుమార్ సోమవారం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయన ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు ఆయనతో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. జీవన్ కుమార్ భగవంత్ కేసరి, పుష్ప, సాహో, రాబిన్ హుడ్, ఈ నగరానికి ఏమైంది, డాకూ మహరాజ్ వంటి పలు చిత్రాల్లో నటించారు.

డీఎస్సీ కరపత్రాల ఆవిష్కరణ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

చింతలపూడి: పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో డీఎస్సీ అభ్యర్థుల కోసం గ్రాండ్ టెస్టులు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖధికారి–2 కిరణ్‌బాబు తెలిపారు. సోమవారం డీఎస్సీ అభ్యర్థుల కోసం రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని అభ్యర్థులు విజయం సాధించాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కేవీవీ సుబ్బారావు పిలుపునిచ్చారు. డీఎస్సీ గ్రాండ్ టెస్ట్ రాసే అభ్యర్థులు తమ పేర్లను 9441698486, 94417 51678 నంబర్లలో నమోదు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కౌన్సిలర్ రాజేంద్రకుమార్, కె.కృష్ణంరాజు, పాల్‌ఆషా, రాజేంద్ర ప్రసాద్, జోషి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ



లోక్‌నాథ్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

లింగపాలెం: ముడిచెర్ల గ్రామంలో గత వారం రోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, మాజీ సొసైటీ అధ్యక్షుడు ముల్లంగి లోక్‌నాథ్‌రెడ్డి కుటుంబాన్ని సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు పరామర్శించారు. ఈ మేరకు మృతి చెందిన లోక్‌నాథ్‌రెడ్డి చిత్ర పటానికి వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు భీమిరెడ్డి వెంకట సూరారెడ్డి (బీవీఎస్‌రెడ్డి), మునునూరి వెంకటేశ్వరరావు, రావి కొండయ్య, బి.ప్రసాద్‌రెడ్డి, బి.ప్రభాకర్‌రెడ్డి, తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబానికి నాయకులు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పీజీఆర్ఎస్‌లో వినతుల స్వీకరణ



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో

జంగారెడ్డిగూడెం: స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీవో ఎంవీ రమణ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పీజీఆర్ఎస్‌లో వచ్చిన సమస్యలను అధికారులు అర్థవంతంగా పరిష్కరించాలన్నారు. సోమవారం నాటి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో పలు సమస్యలపై ఏడు అర్జీలు అందాయని ఆర్డీవో తెలిపారు.